## తిరుచిరాపల్లి ఆదాయపు పన్నుశాఖ చీఫ్ కమిషనర్‌గా టి.విజయలక్ష్మి



**సింగరాయకొండ, మే 13, (ప్రభాతవార్త):**
తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లి ఐన్‌కమ్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్‌గా 1992 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి టి. విజయలక్ష్మి నియమితులయ్యారు. ఆమె మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సతీమణి. ఈ నెల 11వ తేదీన ఆమె పదవి బాధ్యతలు స్వీకరించారు. గత 33 సంవత్సరాలుగా ఆదాయపు పన్ను శాఖలో వివిధ హోదాల్లో సేవలందించిన విజయలక్ష్మి బెంగళూరు, రాయచూర్‌లో జాయింట్ కమిషనర్‌గా పనిచేశారు. అనంతరం కర్నూలులో అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. అలాగే చెన్నైలో కమిషనర్‌గా, హైదరాబాద్‌లో ప్రిన్సిపల్ కమిషనర్‌గా సేవలందించారు. విద్యార్హతల విషయానికి వస్తే... హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో ఈసీఈ విభాగంలో బీటెక్ పూర్తి చేసిన ఆమె బెంగళూరు ఐఐఎంలో ఎంబీఏ చేశారు. అదనంగా సింగపూర్ యూనివర్సిటీ, అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలలో ప్రజా విధానాలపై ప్రత్యేక డిగ్రీలు పొందారు.

ప్రకాశం
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




# పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు**

**ఒంగోలు, ప్రభాతవార్త**
ఒంగోలు నగర కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా నిర్వహించడంతో పాటు పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా పని చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించి పారిశుధ్య నిర్వహణను అలాగే నిరుపయోగంగా ఉన్న కార్పొరేషన్ స్థలాలను పరిశీలించారు. తొలుత జిల్లా కలెక్టర్, నగర పరిధిలోని కొత్త మామిడిపాలెంలో ఉన్న విండ్రో కంపోస్టింగ్ యూనిట్‌ను సందర్శించి సేంద్రియ వ్యర్థాలను ఎరువుగా మార్చే పద్ధతి పరిశీలించి నిర్వాహకుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. చెత్త సంపద కేంద్రాలు పటిష్టంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తదుపరి జిల్లా కలెక్టర్, గాంధీ పార్కును సందర్శించి పార్కు నిర్వహణను పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న వాకింగ్ ట్రాక్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పార్కు పక్కనే నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పీవీఆర్ స్కూల్ ప్రక్కన నిర్మిస్తున్న సులభ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని పరిశీలించి త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఊట చెరువు ప్రాంతాన్ని సందర్శించి నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించి, ఈ స్థలాలను ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ పట్ల జిల్లా కలెక్టర్ అసంతృప్తిని వ్యక్తం చేస్తూ పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా నిర్వహించడంతో పాటు పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రజల సంతృప్తి స్థాయి పెంచేలా పని చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అద్దంకి బస్టాండ్ వద్ద ఉన్న మున్సిపల్ స్థలాన్ని, పాత కూరగాయల మార్కెట్ స్థలాన్ని, శ్రీ బాపూజీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మున్సిపల్ స్థలాన్ని పరిశీలించారు. ఒంగోలు నగరంలో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఒంగోలు మున్సిపల్ కమీషనర్ రాంభూపాల్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ ఐషయ్య, ఎంహెచ్‌ఓ వైష్ణవి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## బల్లికురవ బస్ స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

**- రీజనల్ మేనేజర్ సత్యనారాయణ**



**బల్లికురవ మే 13( ప్రభాతవార్త)**
మండల కేంద్రమైన బల్లికురవ ప్రధాన కూడలిలో నిరుపయోగంగా శిథిలావస్థకు చేరిన బల్లికురవ బస్ స్టేషన్ ను ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతామని ప్రకాశం జిల్లా రీజినల్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. 1989లో నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రిగా, తెలుగు గ్రామీణ క్రాంతి పదం కింద మండలానికి ఒక బస్ స్టేషన్ కార్యక్రమంలో భాగంగా అప్పటి మార్టూరు శాసనసభ్యులు కరణం బలరామకృష్ణమూర్తి కృషితో, బల్లికురవలో దాతల చేయూతతో ,బస్ స్టేషన్ నిర్మాణం సాకారం అయింది. అప్పటి విద్యా శాఖ మంత్రి ఎర్నేని సీతాదేవి బస్ స్టేషన్ ను ప్రారంభించారు. గత పది సంవత్సరాల వరకు బస్ స్టేషన్ ప్రజలకు ప్రయోజనకరంగానే ఉంది. మారిన కాలానికి అనుగుణంగా, కరోనా మహమ్మారి కారణంగా బస్సులు నిలిచి పోవటం, ఆ తర్వాత అన్ని వ్యవస్థల లాగానే బస్ స్టేషన్ కూడా నిరుపయోగంగా మారి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా , సంచార జాతులకు ఆవాసంగా మారింది. రాష్ట్ర ఇంధన శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ మండల కేంద్రమైన బల్లికురవ అభివృద్ధికి, బస్ స్టేషన్ కాంప్లెక్స్ నిర్మాణ కలను సాకారం చేసే విధంగా శాఖా పరమైన కదలికలు తీసుకురావడంతో బుధవారం ఆర్ ఎం సత్యనారాయణ బస్ స్టాండ్ ను పరిశీలించారు. బస్ స్టాండ్ కు ఇరువైపులా ఎల్ ఆకారంలో ముందు వైపు దుకాణాలు నిర్వహించుకున్న వారికి యధావిధిగా బస్ స్టాండ్ స్థలంలోకి జరిగి షాపుల నిర్మాణం చేపట్టుకోవచ్చు అన్నారు. బస్ స్టాండ్ అభివృద్ధిలో స్థానిక వ్యాపారులంతా సహకరించాలని, వారికి ఏ విధమైన సమస్యలు తలెత్తకుండా చూసుకుంటామన్నారు. చిల్లచట్లతో మూసుకుపోయిన బస్ స్టేషన్ ఆవరణను ఇటీవల చిల్ల చెట్లను తొలగించారు. త్వరలో విద్యుత్ సౌకర్యం కల్పించడంతోపాటు, బస్ స్టేషన్ లోకి బస్సుల రాకపోకలు కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట డిపో మేనేజర్ రామ్మోహన్రావు, టి ఐ టు వలి, కొండలు, జాలరావ్ వెంకటేశ్వర్లు, ఫణి, తదితరులు ఉన్నారు.

## డిఎస్సీలో ఎంపికైన వ్యాయమ ఉపాధ్యాయలకు సన్మానం




**ఒంగోలు, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ మెగా డిఎస్సీ 2025లో వ్యాయమ ఉపాధ్యాయ లుగా ఎంపిక అయినా వారం దరికీ ఒంగోలు ఎస్ బి సక్సెస్ కోచింగ్ సెంటర్ ఫౌండర్ వంశీ మరియు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం స్థానిక బచ్చల బాలయ్య కల్యాణ మండపం లో నిర్వహించారు ఈ సందర్భంగా రాష్ట్ర శాప్ డైరెక్టర్ పేరం రవీంద్రనాథ్ ఇంటర్నేషనల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మెంబెర్ చిన్నపరెడ్డి రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ ఒలింపిక్ సభ్యులు కుర్రా భాస్కర్‌రావు, రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్స్పెక్టర్ ఎస్ కె మహబూబ్ బాషా, రామిరెడ్డి రిటైర్డ్ ప్రిన్సిపల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆఫ్ దోమలగూడ గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ వారి చేతులు మీదగా ఎస్బి సక్సెస్ కోచింగ్ సెంటర్ నందు శిక్షణ తీసుకొని డీఎస్సీ 2025లో రాష్ట్రవ్యాప్తంగా 658మంది వ్యాయామ ఉపాధ్యాయుల ఉద్యోగం పొందిన వారందరికీ సన్మానం చేశారు వ్యాయామ ఉపాధ్యాయ ఉద్యోగంలో 93 మార్కులుతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం పొందిన నెల్లూరు జిల్లాకు చెందిన సాయి కోటి ని ఘనంగా సన్మానించి మెమెంటో అందజేశారు అత్యంత పేదరికం నుండి వచ్చిన సాయి కోటి ఒంగోలులోనే శిక్షణ తీసుకుంటూ టీ షాపులో, శని ఆదివారంలు బేల్దారు పనులు చేసి ఈ అకాడమీ నందు శిక్షణ తీసుకొని రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందారు ఈ అకాడమీ ద్వారా ఉద్యోగాలు సాధించిన 658 మందిని కోచింగ్ సెంటర్ నిర్వాహకులు సన్మానించారు ఈ సందర్భంగా రాష్ట్ర సాప్ డైరెక్టర్ పి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఫౌండర్ వంశి అద్భుతమైన ఫ్యాకల్టీని పెట్టి మంచి సెక్షన్ ఇచ్చి ఇంతమందికి ఉద్యోగాలు రావటానికి కారకులయ్యారని అన్నారు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో అనేక మార్పులు తీసుకొచ్చి విద్యార్థులకు అలాగే నిరుద్యోగులకు ఉపయోగపడేలా హాలో అంశాలను పాఠశాల హైస్కూల్ లలో అందజేసి వారికి అన్ని వసతులు కల్పిస్తున్నారని కూటమి ప్రభుత్వంలో మరో మెగా డీఎస్సీను కూడా విడుదల చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు ఈ సన్మాన కార్యక్రమంలో వ్యాయామ ఉద్యోగం సాధించిన అభ్యర్థులతోపాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఆనంద పరవశం పొందారు. ఈ కార్యక్రమంలో పలువురు అతిథులు పాల్గొని ప్రసంగించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే దామచర్ల



**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**
ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి బుధవారం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పాల్గొని 47 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.34 లక్షల 15 వేల విలువైన చెక్కులను అందజేశారు. అనారోగ్య సమస్యలు, ప్రమాదాలు, గుండె శస్త్రచికిత్సలు, కిడ్నీ సంబంధిత వ్యాధులు, అత్యవసర వైద్య చికిత్సలు తదితర కారణాలతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరంగా మారిందని, వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.. ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వానికి మరియు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తమ కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనం కలిగించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బంగారం దుకాణదారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి: ఎస్పీ హర్షవర్ధన్ రాజు

**ఒంగోలు క్రైమ్, ప్రభాతవార్త**



బంగారు దుకాణాల యజమానులు భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు సూచించారు. జిల్లాలో ఇటీవల పెరుగుతున్న చోరీలు, దొంగతనాల నేపథ్యంలో బంగారు వ్యాపారులు ఆధునిక భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆయన తెలిపారు. దుకాణాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవడంతో పాటు ఫుటేజ్‌ను క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు. అలారం వ్యవస్థలు, అత్యవసర హెచ్చరిక పరికరాలు సమర్థవంతంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. దుకాణాల వద్ద 24 గంటల సెక్యూరిటీ గార్డులను నియమించడం ద్వారా అనుమానాస్పద కదలికలను ముందుగానే గుర్తించవచ్చని ఎస్పీ తెలిపారు. కొత్తగా నియమించే సిబ్బంది పూర్తి వ్యక్తిగత వివరాలు, చిరునామాలు, గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా సేకరించాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు దుకాణాల వద్ద సంచరిస్తే లేదా అనుచిత ప్రవర్తన గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. బంగారు వ్యాపారులు నగదు, ఆభరణాల రవాణా సమయంలో కూడా భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. రాత్రి వేళల్లో దుకాణాలు మూసే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీటీవీ పర్యవేక్షణతో పాటు పోలీసుల సహకారం తీసుకోవాలని తెలిపారు. ప్రజల ఆస్తుల భద్రత కోసం పోలీసులు నిరంతరం పహారా నిర్వహిస్తున్నారని, వ్యాపారులు కూడా అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టడం సులభమవుతుందని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు.

## ఆంధ్రకేసరి యూనివర్సిటీలో పోస్టుల భర్తీకి సిద్ధం

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధనా పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 1,523 పోస్టుల భర్తీకి ఈ నెల 15న అధికారిక నోటిఫికేషన్ విడుదల కానుంది. దీంతో నిరుద్యోగ అభ్యర్థుల్లో ఆసక్తి నెలకొంది. ప్రకాశం జిల్లాలోని ఆంధ్రకేసరి యూనివర్సిటీలో మొత్తం 9 రెగ్యులర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు సమాచారం. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయిల్లో ఈ ఖాళీలు ఉండే అవకాశం ఉంది. విశ్వవిద్యాలయంలో అధ్యాపకుల కొరత కారణంగా విద్యా కార్యకలాపాల నిర్వహణలో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ నియామకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అలాగే ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 82 పోస్టులు, రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో 311 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుంది. యూజీసీ నిబంధనల మేరకు అర్హతలు కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండనుంది. ఎంపిక ప్రక్రియలో విద్యార్హతలు, పరిశోధన అనుభవం, ఇంటర్వ్యూకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు సమాచారం.

## పిడిసిసి బ్యాంక్ వార్షిక లాభం రూ. 19కోట్లు

**- 4వేలకోట్ల టర్నోవర్‌తో బ్యాంక్ అభివృద్ధి పదంలో పయనిస్తోంది: ఛైర్మన్ కామేపల్లి**

**ఒంగోలు కలెక్టరేట్, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (పీడీసీసీబీ) 76వ సర్వసభ్య సమావేశం ఒంగోలులో నిర్వహించారు. బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్యాంక్ ఆర్థిక పురోగతి, ఆధునికీకరణ చర్యలు, భవిష్యత్ ప్రణాళికలపై విస్తృతంగా చర్చించారు. బ్యాంక్ మొత్తం వ్యాపార లావాదేవీలు రూ.4 వేల కోట్లకు పైగా నమోదయ్యాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.19 కోట్ల లాభం సాధించామని ఛైర్మన్ వెల్లడించారు. స్థానిక డిపాజిట్ల సేకరణ, రైతులకు అందిస్తున్న సేవల విస్తరణ వల్లే ఈ స్థాయి వృద్ధి సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ గ్రామీణ సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. గతంలో నష్టాల్లో ఉన్న బ్యాంకును అభివృద్ధి దిశగా నడిపించి లాభాల్లోకి తీసుకువచ్చామని తెలిపారు. రైతులు, చిన్న వ్యాపారులు, మహిళా సంఘాలకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తూ సహకార రంగాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. స్థానిక ప్రజలు బ్యాంకుపై నమ్మకం ఉంచి డిపాజిట్లు పెంచడం అభినందనీయమన్నారు .సమావేశంలో భాగంగా పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల భవనాల నిర్మాణం, మరమ్మతుల కోసం రూ.5 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు రుణ ఆదేశాలను పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాలకు సొంత భవనాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులకు బ్యాంకింగ్ సేవలు మరింత సులభంగా అందేలా డిజిటల్ సేవలను కూడా విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. బ్యాంక్ 51వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రధాన కార్యాలయాన్ని ఆధునికీకరించిన అనంతరం ఐదు కొత్త బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది బదిలీల్లో పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని, త్వరలో కొత్త నియామకాలు చేపట్టనున్నామని యాజమాన్యం వెల్లడించింది. గత పాలకవర్గాల కంటే అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో పనిచేస్తున్నామని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి సహకార బ్యాంకులు కీలక పాత్ర పోషిస్తాయని సమావేశంలో స్పష్టం చేశారు.

## ఎస్పీని కలిసిన ఎమ్మెల్యేలు జనార్ధన్, అశోక్‌రెడ్డి

**ఒంగోలు, ప్రభాతవార్త**



సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ హర్షవర్ధన్ రాజును బుధ వారం ఒంగోలులోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఒం గోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు, గిద్దలూరు శాసనసభ్యులు అశోక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించే అంశాలపై వారు ఎస్పీతో చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ సమ న్వయంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. అనంతరం ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు వారు శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజా భద్రత విషయంలో తీసుకుంటున్న చర్యలను అభినందించారు.

## ఘనంగా శిద్దా జన్మదిన వేడుకలు

**- ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు ఉద్యోగులకు బోనస్ పంపిణీ**




**చీమకుర్తి, మే 13, ప్రభాతవార్త**
కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత శిద్దా వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం కృష్ణ సాయి గ్రానైట్ క్వారీలో కార్మికుల మధ్య ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకల్లో శిద్దా హనుమంతరావు, శిద్దా భరత్ పాల్గొని భారీ కేక్ కట్ చేశారు. ఒంగోలు కర్నూలు రోడ్డు ప్రక్కన వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రిమ్స్ ఆసుపత్రి వైద్యుల పర్యవేక్షణలో శిబిరంలో 25 మంది రక్తదానం చేశారు. డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో 85 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్లో పనిచేస్తున్న ఉద్యోగస్తుల పిల్లల లో 10 వ తరగతి, జూనియర్ ఇంటర్, సీనియర్ ఇంటర్లలో ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం, తృతీయ స్థానం పొందిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ లో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు బోనస్ పంపిణీ చేశారు. భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిద్దా హనుమంతరావు, శిద్దా భరత్ లు మాట్లాడుతూ ప్రతి ఏడాదిశిద్దా వెంకటేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు కార్మికుల మధ్య సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ సాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రతినిధి పి ఉదయ్, జనరల్ మేనేజర్ టీవీ మురళీమోహన్రావు, బి కమలాకర్, ఆంజనేయులు, రాంబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తహీనత నివారణపై అవగాహన



**బల్లికురవ మే 13( ప్రభాతవార్త)**
కౌమార దశలో రక్తహీనత నివారణ పై బుధవారం మండలంలోని కొప్పెరపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భారతి అవగాహన కల్పించారు. స్థానిక అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో కిషోర్ బాలికలు, అంగన్వాడి కార్యకర్తలకు అనీమియా లోపిస్తే ఎదుర్కోవాల్సి న దుష్పరిణామాలను తెలియచెప్పారు. వేగంగా పెరిగే కౌమార దశలో ఉన్నవారికి ఇనప ఇనపదాతు లోపం వల్ల అలసట, బలహీనత, చర్మం పొడిబారటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి అన్నారు. దీని నివారణ కోసం ఇనపదాతువు అధికంగా లభించే మాంసం ,గుడ్డు, ఆకుకూరలు, సిట్రస్ పండ్లను అధికంగా తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వటం అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు.

## మీకోసం కార్యక్రమంలో మీ సమస్యలు తెలియజేయండి: తాసిల్దార్



**బల్లికురవ మే 13( ప్రభాతవార్త)**
ప్రభుత్వం చేపట్టిన మీకోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుంటూ మండలంలోని ప్రజలు ఈనెల 15న అద్దంకి నియోజకవర్గస్థాయిలో సంతమాగులూరు లో జరిగే మీకోసం కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలు తెలియజేయాలని తాసిల్దార్ రవి నాయక్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆదేశాల మేరకు ప్రజలంతా కార్యక్రమానికి తరలిరావాలన్నారు. జిల్లాస్థాయి అధికార యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలో ప్రజల ముంగిట అందుబాటులో ఉంటున్నందున తమ సమస్యల పరిష్కారానికి మీకోసం వేదికను మండల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంతమాగులూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో 15వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మీ కోసం కార్యక్రమం 12 గంటల వరకు కొనసాగుతుందని వివరించారు.

## కిషోర బాలబాలికలకు అవగాహన



**ఉలవపాడు, మే 13, ప్రభాతవార్త**
ఉలవపాడు మండలం చాగొల్లు ఎస్టీ కాలనీలోని అంగనవాడి సెంటర్లో సూపర్వైజర్ రమాదేవి అధ్యక్షతన బాల బాలికలకు కిశోర వికాసం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ సిడిపిఓ మాధవి లత పాల్గొని, కిశోర వికాసం పై పలు విషయాలను తెలియజేశారు. బాల బాలికలు పౌష్టికాహారం తీసుకోవడంలో చొరవచూపాలని, ఎదుటివారి నుంచి వచ్చే ఆపదల నుంచి తప్పించుకునే విధానాలను వివరించారు. బలమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఒత్తిడికి తలొగ్గి బాల్యవివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. వీటన్నిటిని అధిగమించేందుకు చదువుపై శ్రద్ధ వహించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. స్వతంత్రమైన ఆలోచనలతో ముందుకు సాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పరిశుభ్రత అంతా పారిశుద్ధ్య కార్మికులదే ఎంపీడీవో కె.స్వరూప రాణి



**జె. పంగులూరు మే 13 ప్రభాతవార్త**
మన గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులదే ప్రముఖ పాత్ర వహిస్తున్నారని ఎంపీడీవో కె. స్వరూప రాణి అన్నారు. జిల్లా కమిషనర్, పంచా యతీ రాజ్ మరియు గ్రామాభివృద్ధి వారి ఆదేశాల మేరకు మండల ఎంపీడీవో కె. స్వరూప రాణి ఆధ్వ ర్యంలో స్వచ్ఛ పదం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో స్వచ్ఛ పదం కార్యక్రమం ద్వారా పరిశుభ్రంగా ఉండటానికి పారిశుధ్య కార్మికులే నిబద్ధత పనిచేస్తున్నారని, పంగులూరు గ్రామపంచాయతీలోను, పంగులూరు నుండి ముప్పవరం లింక్ రోడ్డుకు ఇరువైపులా గల ఉన్న చెత్త దిబ్బలను, తుమ్మ చెట్లను పారిశుధ్య కార్మికుల చే తొలగించడం జరిగిందని ఎంపీడీవో కె. స్వరూపారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కె. సుమంత్, పంచాయతీ కార్యదర్శి ఎం.శిరీష పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## కొత్తపట్నం మండల టాపర్ పూజితకు ఘన సత్కారం



**కొత్తపట్నం, మే 13, ప్రభాతవార్త**
మండలంలోని ఈతముక్కల గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు ఆనందబాబు కుమార్తె చిరంజీవి బత్తుల పూజిత పదవ తరగతి ఫలి తాల్లో అద్భుత ప్రతిభ కనబర్చి మం డల స్థాయిలో 579/600 మార్కులతో తొలి ర్యాంకు సాధించింది. పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని అయిన పూజిత ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఈ ఘనత సాధించడం పలువురికి ఆదర్శంగా నిలిచింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని క్రమశిక్షణతో చదివితే విజయాలు సాధించవచ్చని తెలిపారు. మండల టాపర్‌గా నిలిచిన పూజితను జ్ఞాపికతో పాటు రూ.10 వేల మెరిట్ స్కాలర్‌షిప్ నగదు బహుమతితో ఘనంగా సత్కరించారు. అలాగే ఆర్థిక ఇబ్బందులను లెక్కచేయకుండా కుమార్తెను ఉన్నత చదువులు చదివిస్తున్న తండ్రి ఆనంద బాబును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెడ్‌మాస్టర్ చెంచు పున్నయ్య, డా చాపల శాంతకుమారి, డా సానల ధీరజ్ బాబు, డా. పురాణం మహిత, డా. నరహరి వెంకట సుస్మిత, డా. నాగిడి కుమార్ వర్మ, డా దోనె సృజన్, డా కొప్పోలు సౌమిత్ర పల్లవ్ పాల్గొన్నారు.

6:6.qxd 5/13/2026 11:58 PM Page 1



## స్వచ్ఛపథం కార్యక్రమంను పరిశీలించిన డీపీవో వెంకటేశ్వరరావు బృందం

**సంతనూతలపాడు, మే 13, ప్రభాతవార్త**



సంతనూతలపాడులో బుధవారం నాడు జరుగుతున్న స్వచ్ఛ పథంకార్యక్రమంను జిల్లాపంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వర రావు పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణకు పంచాయతీ సిబ్బందికి డీపీవో వెంకటేశ్వరరావు పలు సూచనలు ఇచ్చారు. సంతనూతలపాడులోని వడ్డెరపాలెం, మద్దులూరు వెళ్లే రహదారి రెండు వైపులా పేరుకుపోయిన చెత్తను ఈ సందర్భంగా తొలగించారు. డీపీవో వెంకటేశ్వరరావు, ఎంపీడీవో డి.సురేష్‌బాబు, డిప్యూటీ ఎంపీడీవో యు.అరుణకుమారి, సంతనూతలపాడు పంచాయతీ అభివృద్ధి అధికారి ఆర్.శ్రీనివాసులు తదితరులు స్వయంగా పంచాయతీ కార్మికులతో శానిటేషన్ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. వీరు క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టారు. స్వచ్ఛ పథం కార్యక్రమంపై ర్యాలీ, అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. తడిచెత్త, పొడి చెత్తను వేరు చేయాలని డీపీవో వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా సూచించారు. మన గ్రామం- మన బాధ్యత అనే భావనతో ప్రతి ఒక్కరు గ్రామాల పరిశుభ్రతకు సహకరించాలని డీపీవో వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా కోరారు. స్వచ్ఛమైన పరిసరాలు ఆరోగ్యాన్ని సంరక్షిస్తాయని ఆయన పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ రాష్ట్ర కమీషనర్ వారి ఆదేశాల మేరకు ఈ నెల 31వ తేదీ లోపు పన్ను చెల్లించిన వారికి 5శాతం రిబేట్ లభిస్తుందని డీపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామస్తులు దీనిని సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు.

## మహానాడును జయప్రదం చేయండి

**- సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్**

**సంతనూతలపాడు, మే 13, ప్రభాతవార్త**



ఈ నెల 18న సోమవారం ఉదయం 10 గంటలకు త్రోవగుంట సమీపంలో గల విష్ణుప్రియ ఫంక్షన్ హాల్ నందు సంతనూతలపాడు నియోజకవర్గ మహానాడు కార్యక్రమం జరగనున్నట్లు సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో బుధవారం నాడు జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదట 18,19,20వ తేదీల్లో మినీ మహానాడు నిర్వహించాలని సమావేశంలో సూచించారు. ఇందులో భాగంగా 18 వ తేదీ సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయి ఈ మినీ మహానాడు ఏర్పాటుకు నిర్ణయించారు. అదే విధంగా ఈనెల 29 వ తేదీన నెల్లూరులో జరిగే రాష్ట్ర మహానాడు, బహిరంగ సభకు జన సమీకరణకు ఈ సందర్భంగా నాయకులతో ఎమ్మెల్యే విజయ్ కుమార్ చర్చించారు. ఈనెల 18 వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు త్రోవగుంట సమీపంలో గల విష్ణుప్రియ ఫంక్షన్ హాల్ నందు జరిగే నియోజకవర్గ స్థాయి మహానాడు కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, మద్దిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నం రాజేశ్వరి ప్రసాద్, రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమైక్య అధ్యక్షులు మండవ జయంతిబాబు, బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, బాపట్ల పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి తన్నీరు శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంపతోటి అంకారావు, సంతనూతలపాడు, చీమకుర్తి, నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, గొట్టిపాటి రాఘవరావు, తెళ్ళ మనోజ్‌కుమార్, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, చీమకుర్తి పట్టణ టీడీపీ అధ్యక్షులు ఏ.చలమయ్య, టీడీపీ నాయకులు గుమ్మడి సాయి, చిన్న, కాట్రగడ్డ రమణయ్య, దేవర, వై.రాంబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

### విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పలు అంశాలపై సమీక్ష

**సంతనూతలపాడు, మే 13, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండల రెవెన్యూ కార్యాలయంలో బుధవారం నాడు మండల ఇన్‌చార్జి తహసీల్దార్ ఎన్.మాబు సుభాని అధ్యక్షతన విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం పారదర్శకతగా పంపిణీ జరుగుతుందా లేదా అనే అంశాలపై మండల కమిటీ సమావేశంలో ఈ సందర్భంగా చర్చించారు. రేషన్, ఎల్పిజి సిలిండర్ల పంపిణీ ప్రక్రియ, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ సెంటర్లలో తదితర వాటి యందు ఈ పంపిణీ ప్రక్రియపై ఇన్‌ఛార్జి తహసీల్దార్ ఎన్.మాబు సుభాని తన ప్రసంగంలో చర్చించారు. సక్రమంగా పంపిణీ చేయకపోతే చర్యలు తప్పవని ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాబు సుభాని హెచ్చరించారు. ప్రభుత్వం పంపిణీ వ్యవస్థను పగడ్బందీగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపీడీవో డి.సురేష్‌బాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. 45 రోజులు తదుపరి గ్యాస్‌ను బుక్ చేసుకుంటే రెండు మూడు రోజుల్లో సిలిండర్ వస్తుందని సంతనూతలపాడు అయ్యప్ప ఇండేన్ గ్యాస్ ప్రతినిధి మునగా చంద్రశేఖర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు మధ్యాహ్న భోజన రేషన్ సక్రమంగా అందుతుందన్నట్లు ఎంఈఓ డి.వెంకారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.సావిత్రి, సీనియర్ అసిస్టెంట్ రామ్ తేజ్, ఎంఈఓ షణ్ముఖ కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెలుగొండయ్య, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి, వీఆర్వోలు, సంఘ నాయకులు మట్టా పోలిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ పథం కార్యక్రమాలను పరిశీలించిన డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్

**సంతనూతలపాడు, మే 13, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం చంద్రపాలెం గ్రామంలో బుధవారం నాడు స్వచ్ఛపథం కార్యక్రమాలను డిప్యూటీ ఎంపీడీవో(జీఎస్‌డబ్ల్యూఎస్ ఆఫీసర్) పి.రవికుమార్ పరిశీలించారు. గ్రామంలో రహదారికి రెండు వైపులా చెత్తను తొలగించారు. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని స్పెషల్ ఆఫీసర్ రవికుమార్ పరిశీలించారు. తదుపరి తక్కెళ్ళపాడు గ్రామంలో ఆధార్ స్పెషల్ కేంద్రాన్ని డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారులు మౌనిక, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నేత రాజు తండ్రి నారాయణకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఘన నివాళులు

**సంతనూతలపాడు, మే 13, ప్రభాతవార్త**



సంతనూతలపాడు మండలం పి.తక్కెళ్ళపాడు గ్రామంలో బుధవారం మృతి చెందిన టీడీపీ జిల్లా నాయకులు కుంచాల రాజు తండ్రి నారాయణ(83)కు సంతనూతలపాడు శాసన సభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ ఘన నివాళులర్పించారు. టీడీపీ జిల్లా నాయకులు కుంచాల రాజు తండ్రి నారాయణ వయోభారంతో బుధవారం తన స్వగ్రామమైన తక్కెళ్ళపాడు గ్రామంలో మృతి చెందారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే విజయ్ కుమార్ నారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం నారాయణ కుమారులైన కుంచాల రాజు, ప్రసాదు, నాగరాజులు, వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే విజయ్ కుమార్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ప్రేముల కోటయ్య, మాజీ మార్కెట్ కమిటీ డైరక్టర్ ప్రేమల బ్రహ్మయ్య, గ్రామ నాయకులు బొడ్డపాటి చలపతిరావు, సర్వేపల్లి శ్రీను, గోరంట్ల చిరంజీవి, మక్కెన లక్ష్మీనారాయణ, రాజేష్, తగరం కోటయ్య, ప్రేముల అంకయ్య తదితరులు ఈ సందర్భంగా నారాయణ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అనంతరం తక్కెళ్ళపాడు గ్రామంలో టీడీపీ జిల్లా నాయకులు కుంచాల రాజు తండ్రి నారాయణకు అంత్యక్రియలు నిర్వహించారు.

## మన కనిగిరి మన ఉగ్ర నినాదాలతో మార్మోగిన తిరుణాళ్ల

**- అభివృద్ధి పనులపై ఉద్వేగభరిత ప్రసంగం**

**కనిగిరి, మే 13, ప్రభాతవార్త**





కనిగిరి పట్టణంలోని కొత్తూరులో శ్రీ అభయాంజనేయస్వామి జయంతి సందర్భంగా నిర్వహించిన తిరుణాళ్లలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అభివృద్ధి కార్యక్రమాలపై ఉద్వేగభరితంగా ప్రసంగించారు. గత 23 నెలల్లో కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టిన పలు పనులను సభలో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ 2014లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మంజూరు చేయించిన మినీ బైపాస్ పనులు 2024 వరకు ఎవరు పట్టించుకోలేదన్నారు. అయితే 2025లో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన ఆరు నెలల్లోనే మినీ బైపాస్‌కు మళ్లీ అనుమతులు తీసుకువచ్చి నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఇదే తెలుగుదేశం పార్టీ అభివృద్ధి సంకల్పమని పేర్కొన్నారు. కనిగిరికి రైలు సౌకర్యం వచ్చిందని, మరో 15 రోజుల్లో ట్రిబుల్ ఐటీ నిర్మాణానికి భూమి పూజ జరుగుతుందని వెల్లడించారు. ప్రతి ఇంటికి కొళాయి ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించిన తర్వాతే ఓట్లు అడగడానికి వస్తానని, లేకపోతే ప్రజల ముందుకు రానని స్పష్టం చేశారు. 50 ఏళ్ల క్రితం ప్రజలు తాగిన స్వచ్ఛమైన దరువు నీరు ప్రస్తుతం కాలుష్యానికి గురైందని, దాన్ని శుభ్రపరిచే క్రమంలో ఇప్పటికే 1500 ట్రాక్టర్ల చెత్తను తరలించామని చెప్పారు. జలధార- జలహారతి పథకం కింద దరువును అభివృద్ధి చేసి భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు చేపడుతున్నామని, భవిష్యత్తులో దానిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, ట్రిబుల్ ఐటీ నిర్మాణం, ఇంటింటికి కొళాయి తాగునీరు, నడికుడి - శ్రీకాళహస్తి రైల్వే మార్గం, నిమ్జ్ వంటి ఐదు ప్రధాన పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే ఉగ్ర స్పష్టం చేశారు. సభ ముగింపు సమయంలో ఎమ్మెల్యే మన కనిగిరి అని పలకగా, తిరునాళ్లకు హాజరై ప్రజలు మన ఉగ్ర అంటూ నినాదాలతో మార్మోగించారు. మన ఊరు- మన ఉగ్ర, మన ఊరు.. మన కనిగిరి అంటూ సభా ప్రాంగణం హోరెత్తింది.

## మిట్టపాలెంలో వైభవంగా కోదండరామస్వామి కళ్యాణం

**సీఎస్‌పురం, మే 13, ప్రభాతవార్త**

మండలంలోని మిట్టపాలెం గ్రామంలో శ్రీ కోదండరామస్వామి కళ్యాణం చలువాది తిరుపతయ్య దంపతుల ఆధ్వర్యంలో స్థానిక అర్చకులు ఎం.శివప్రసాద్ శర్మ వేదమంత్రాల నడుమ బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట సీతా, రామ లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు, ఉత్సవ మూర్తులకు రుత్వికులు శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం సీతా, రాము ఉత్సవ మూర్తులకు వేడుకగా ఎదురుకోల నిర్వహించి భజంత్రీల మేళతాళాల నడుమ కళ్యాణ వేదికపైకి తీసుకువచ్చి కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయగా దాతలు కొమ్మినేని రమణయ్య, రమాదేవి దంపతులు భక్తులకు ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్, పోలవరపు గురవయ్య, పి.చిన్న నరసింహులు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బాల కేశవరెడ్డి, నీటి సంఘం చైర్మన్ దొనపాటి మోహన్‌రెడ్డి, తీకెనం బాబురావు, తీకెనం లక్ష్మీనారాయణ, చందలూరి కాశయ్య, షేక్ రజ్జబ్ భాషా, కలీల్, చావా ఆదినారాయణ, ఎలికా నవీన్, చావాకాశీనాథ్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఏలూరి కృషి - పేదలకు ఆర్థిక భరోసా

**- సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత**

**మార్టూరు, మే 13, ప్రభాతవార్త**



అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేక ఆందోళన చెందుతున్న పేద మధ్య తరగతి కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అండగా నిలుస్తున్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు టీడీపీ శ్రేణులు అందజేశారు. మార్టూరు మండలం కోనంకి గ్రామానికి చెందిన అమర్తలూరి వీరయ్యకు రూ.50వేలు, వలపర్ల గ్రామానికి చెందిన మూకిరి కిశోర్‌కు రూ.1,51,616, కోనంకి గ్రామానికి చెందిన ఉప్పలపాటి నాగలక్ష్మీకి రూ.1,43,490, కారంచేడు మండలం యర్రంవారిపాలెం గ్రామానికి చెందిన యర్రం నాగచైతన్యకు రూ.76,438 లు మంజూరు అయ్యాయి. ఆ చెక్కులను స్థానిక టీడీపీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లింగసముద్రంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

**లింగసముద్రం, మే 13, ప్రభాతవార్త**



లింగసముద్రం మండలంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మోడల్ ప్రైమరీ స్కూల్ లింగసముద్రం సౌత్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మండల విద్యాశాఖ అధికారికే.మాల్యాద్రి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసిర్యాలీలో పాల్గొన్నారు. పాఠశాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి ఫైవ్ ప్లస్ చిల్డ్రన్స్‌ని పాఠశాల నందు 9 మంది విద్యార్థులను ఎన్‌రోల్ చేశారు. ప్రైవేటు పాఠశాల విద్యార్థుల గృహాలను సందర్శించి వారిలో ఐదుగురు విద్యార్థులను పాఠశాల నందు ఎన్‌రోల్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కే.మాల్యాద్రి, ప్రధానోపాధ్యాయులు ఎన్.వెంకటేశ్వర్లు, సుధాకర్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, సీఆర్‌ఎంటీలు, ఐఆర్టీలు పాల్గొన్నారు.

## మార్కాపురం బస్సు ప్రమాదబాధితులుకు ఆర్థిక సహాయం

**- అంకభూపాలపురంలో చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే**

**కందుకూరు మే 13, ప్రభాతవార్త**



ఈ ఏడాది మార్చి 26వ తేదీన మార్కాపురం సమీపంలోని రాయవరం వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో వలేటివారిపాలెం మండలం అంకభూపాలపురం గ్రామానికి చెందిన బండారు పద్మ మృతిచెందింది. బత్తుల మణెమ్మ, బత్తుల రోహన్‌లు ఇద్దరు గాయపడ్డారు. వీరికి ప్రభుత్వం మృతురాలుకు రూ.5లక్షలు, క్షతగాత్రులు ఒక్కొక్కరికి రూ.2లక్షలు చొప్పున ఆర్థిక సహాయం ప్రకటించింది. ఇందుకు సంబందించిన బ్యాంకు చెక్కులను వలేటివారిపాలెం తహసిల్దార్ కార్యాలయానికి పంపింది. దీంతో స్థానిక తహసిల్దార్ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరినాగేశ్వరరావు చేతుల మీదుగా చెక్కులను అంకభూపాలపురంలో అందచేశారు. మృతురాలు తల్లి అనంతమ్మకు రూ.5లక్షలు, మణెమ్మ భర్త వెంకటయ్యకు, రోహిత్ తల్లి శ్రీలక్ష్మిలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతురాలి ఇద్దరి పిల్లలను ఎన్టీయార్ ట్రస్టు భవన్ స్కూలులో చదివిస్తామని హామీ ఇచ్చారు. అదేవిదంగా క్షతగాత్రుడు రోహన్ చదువుకు అన్నివిధాలా సహాయం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సహాయం సైతం త్వరలో అందజేస్తామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మినరసింహం, పార్టీ నాయకులు పెగడ శ్రీను, వలేటి మధు, బండారు సోమరాజు, బక్కముంతల మాల్యాద్రి, పందిలక్ష్మినారాయణ, సిరిగిరి కొండారెడ్డి, పెగడా మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్విదిస్తున్న ఎమ్మెల్యే

**కందుకూరు మే 13, ప్రభాతవార్త**



వలేటివారిపాలెం మండలం పోలినేనిపాలెం నివాసి మానికొండ శ్రీనివాసులు, రమణమ్మల కుమారుడు మదన్ వివాహం వర్షిణితో బుధవారం పోలినేనిపాలెం లో జరిగింది. ఈ కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అదే విధంగా రోళ్ళపాడులో వధూవరులు రామాంజనేయులురెడ్డి మృదుల నలుగు కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మినరసింహం, తెదేపా నేతలు వలేటి నరసింహం, మానికొండ కొండయ్య, ఎంపీటీసీ నరసింహం కాకుమాని ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## బీసీలకు 52 శాతం రిజర్వేషన్‌లు పెంచాలి

**- కందుకూరులో నాయీబ్రాహ్మణ సంఘ సమావేశం**

**కందుకూరు మే 13, ప్రభాతవార్త**



స్థానిక సంస్థల పదవులలో బీసీలకు 52శాతం కేటాయించాలని బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, నాయీబ్రాహ్మణసంఘం ప్రధానకార్యదర్శి వల్లూరు కోటేశ్వరరావులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇందులో ఏబీసీడీల ఉపకులాలకు రిజ్వరేషన్‌ల ప్రాతిపదికన సమన్యాయం చేయాలని వారు కోరారు. బుధవారం పట్టణంలోని త్యాగరాజస్వామి ఆలయ సన్నిదిలో ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మాట్లాడుతూ జూన్ 3వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కరుణానిధి 103వ జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బహుజన మాట బహుజన పాటతోపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ జనగణలో సమగ్ర కులగణ చేయాలన్నారు. ఈడబ్ల్యు, ఎస్సీ రిజర్వేషన్లు రద్దు చేయాలని బీసీలకు రక్షణ చట్టం వెంటనే చేయాలని బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలని ఆయన కోరారు. ఇందుకు సంబందించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘంకు సంబందించిన పలువురు నేతలు కరేటి సుబ్బారావు, వల్లూరి సాంబశివరావు, పతకమూరి వెంకట సాయికిరణ్, కొచ్చర్ల జయకృష్ణ, చింతలపూడి సురేష్‌బాబు, కరేటి మహేష్, గోనుగుంట వేణు, కొణిజేటి శ్రీనివాసరావు, కరేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## చింతలపాలెంలో రూ.8 లక్షల డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

**- అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన టీడీపీ నాయకులు**

**కనిగిరి, మే 13, ప్రభాతవార్త**



ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు చింతలపాలెం ప్రాంతంలో రూ.8లక్షల వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్‌తో కలిసి టౌన్‌తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. ప్రాంత ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా డ్రైనేజీ పనులు చేపడుతున్నామని నాయకులు తెలిపారు. కాలువల సమస్యలు పరిష్కారమై ప్రజలకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మూలే శ్రీను, పెన్నా వెంకటేశ్వర్లు, షేక్ రెహ్మాన్, ముతుకుముళ్ల రవణరెడ్డి, మధుబాబు, ఉండే శ్రీను, పెన్నా కొండలు, ప్రసాద్, బ్రహ్మయ్య, వెన్న శ్రీనివాసులు, అంజి నీలిశెట్టి, నాగ పాతూరు, డానియల్ తదితర వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిబంధనల మేరకు స్కూల్ బస్సులు మార్పు చెయ్యాలి

**తాళ్లూరు, మే 13,ప్రభాతవార్త**



అన్ని పాఠశాల బస్సులను ఆటోమోటివ్ ఇండస్ట్రీ స్టాండర్డ్ ప్రకారం పాఠశాలల, కళాశాలల బస్సులు నిబంధనలు పాటించాలని దర్శి మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ కోరారు. తాళ్లూరు మండలంలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల బస్సులను జిల్లా ఉప రవాణా కమీషనర్ ఆర్.సుశీల ఆదేశాల మేరకు అసిస్టెంట్ ఎంవీఐ జస్వంత్, సిబ్బందితో కలసి తూర్పుగంగవరం, తాళ్లూరులలో పాఠశాలల బస్సులను పరిశీలించి ఎఐఎస్ నిబంధనల ప్రకారం ఉన్నాయా లేవా అన్న విషయాలను పరిశీలించి లేని వాటిని నిబంధనలను అనుగుణంగా మార్పు చేసుకోవాలని సూచించారు. బస్సు నిర్మాణం, భద్రతా ఫీచర్లు, విఎల్ టిడి, పానిక్ బటన్, బస్సు ఎక్కు సమయంలో మెట్లు ఎత్తు 225 మి.మీలు మాత్రమే ఉండాలని సూచించారు. విఎల్టి పరికరాలతో పాటు, ఎమర్జెన్సీ డోర్స్ పనిచేయు తీరు కూడ సక్రమంగా ఉండాలని సూచించారు. డ్రైవర్లు, అటెండర్ల వివరాలు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. పూర్తి వివరాలతో ఎంవీఐ కార్యాలయంకు సమర్పించాలని చెప్పారు.

## పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

**తాళ్లూరు, మే 13, ప్రభాతవార్త**



పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చునని ఎంపీడీవో పి. అజిత అన్నారు. మండలంలోని తూర్పు గంగవరంలో బుధవారం స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా తూర్పు గంగవరం నుంచి బొద్దికూరపాడు ప్రధాన రహదారి శుభ్రపరిచే పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రతను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రతి బుధవారం స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ పథం కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. రహదారుల పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించి పర్యావరణాన్ని కాపాడవచ్చన్నారు. పరి శుభ్రమైన పరిసరాలతో ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించడం ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వి. శ్రీనివాసరావు, పంచాయతీ అభివృద్ధి అధికారి డి.నాగమల్లేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైస్సార్ కె.ప్రసాదు, నాయకులు వి. సుబ్బయ్య, గూడా పుల్లారెడ్డి, జె. హనుమంతురావు, స్వర్ణ గ్రామ కార్యాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

### నర్సరీ గ్రోయర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కేవీ నరసింహారెడ్డి ఎన్నిక

**దర్శి, మే 13, ప్రభాతవార్త**





పరస్పర సహకారంతో ముందుకు సాగుదాం. సమన్వయంతో అవకాశాలు అందిపుచ్చుకొందాం. ఆంధ్రప్రదేశ్ నర్సరీ గ్రోయర్ అసోసియేషన్ రాష్ట్ర సర్వసభ్య సమావేశం శ్రీనివాస మంగాపురంలో గోపాలం రవీంద్ర అధ్యక్షతన జరిగింది. ముఖ్యంగా నీరు, విద్యుత్, అధిక ధరలు, మార్కెటింగ్ లాంటి సమస్యలతో పాటు వాతావరణ ప్రతికూలత, ప్రకృతి వైపరీత్యాలలతో నష్టపోయే వారిని ఆదుకోవాలని అన్నారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడుగా ఆకుల చలపతిరావు, ఉపాధ్యక్షులుగా సరిత, విజయవాడ ప్రధాన కార్యదర్శిగా నరసింహారెడ్డి, దర్శి సహాయ కార్యదర్శులుగా దాంతాటి రమేష్ శ్రీకాకుళం, బండి అన్న రవి అంగళ్లు, కోశాధికారిగా మన్నే శ్రీనివాసరావు విజయవాడ, సమన్వయకర్తగా లక్ష్మీనారాయణ బాపట్ల, పౌర సంబంధాల అధికారి రాజ్ కుమార్ విజయవాడ, కార్యవర్గ సభ్యులుగా రంగస్వామి పొణ్యం, కృష్ణమూర్తి జంగారెడ్డి గూడెం, ఆకివీడు ప్రసాద్, ఆకుల మునిరత్నం తిరుపతి, కాకినాడ వి.ప్రసాద్, గుంటూరు ఉమా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు డాక్టర్ ఎం.ఆర్ఎన్ వర్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో నర్సరీ అసోసియేషన్ అందిపుచ్చుకుని ప్రజలకు తక్కువ ధరలో మొక్కలు అందించాలని సంగం ఐక్యతే ముఖ్యమని అన్నారు.

### నీట్ పేపర్ లీకుతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న కేంద్ర ప్రభుత్వం

**- రాష్ట్ర కేకేసీ చైర్మన్ దర్శి నియోజకవర్గం ఇన్‌ఛార్జి కైపు వెంకట కృష్ణారెడ్డి ధ్వజం**

**దర్శి, మే 13, ప్రభాతవార్త**



నీట్ పేపర్ లీక్ విద్యార్థుల భవిష్యత్తుతో ఆట విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. తల్లిదండ్రుల కష్టం, విద్యార్థుల శ్రమ వృధా కాకూడదు. 2017,2021,2024 అవకతవకలు కేంద్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. కైపు వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్ష ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలు దేశ వ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని దర్శి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కైపు వెంకట కృష్ణారెడ్డి హామీ ఇచ్చారు.

### బంగారు షాపుల యజమానులతో సమావేశం నిర్వహించిన దర్శి సీఐ రామారావు

**దర్శి, మే 13, ప్రభాతవార్త**



ఈ వేసవికాలంలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు దొంగతనాల నివారణలో భాగంగా బుధవారం దర్శి పట్టణంలోని బంగారు షాపుల యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో దర్శి సీఐ వై.రామారావు, దర్శి ఎస్సై ఎం.మురళి బంగారు వ్యాపారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రతి బంగారు షాపులో కూడా నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, షాపుల యజమానులు అందరూ కలిసి అవసరమైన చోట నైట్ వాచ్‌మెన్‌ను నియమించుకోవాలని సూచించారు. అలాగే షాపులకు సెన్సార్ ఆధారిత అల్లారం సిస్టమ్‌లు, డబుల్ షట్టర్లు ఏర్పాటు చేసుకుని అప్రమత్తంగా ఉండాలని, దొంగతనాల నివారణలో పోలీసు శాఖకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు కూడా పలు సూచనలు చేశారు. విలువైన బంగారు ఆభరణాలు, ఇతర ఖరీదైన వస్తువులను ఇళ్లల్లో ఉంచకుండా బ్యాంకుల లాకర్లలో భద్రపరుచుకోవాలని, వీలైనంత వరకు ఇళ్ల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### వాసవి అమ్మవారిని దర్శించుకున్న సబ్ జడ్జి జీవీఎల్ సరస్వతి

**- ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ వైభవంపై ప్రశంసలు**



**కనిగిరి, మే 13, ప్రభాతవార్త**

కనిగిరిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని ఈస్ట్ గోదావరి జిల్లా కొవ్వూరు సబ్ జడ్జి జీవీఎల్ సరస్వతి దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయం ఎంతో ఆధ్యాత్మిక వాతావరణంలో, అందంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించిన ఆలయ అర్చకుడు అజయ్ కుమార్ సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మాదాల సుబ్బారావు, వెంకటేశ్వర్లు దంపతులు కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో సబ్ జడ్జి జీవీఎల్ సరస్వతిని సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు దేవకి శ్రీనివాసులు, కార్యదర్శి బచ్చు రమేష్, కోశాధికారి కొలిపర్తి వెంకట స్వామి, నార్లపాటి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## తమ్మనేని శ్రీనివాసరెడ్డి పెద్దకర్మకు ఏర్పాట్లు

**- కనిగిరి రాజకీయ, సామాజిక వర్గాల్లో విషాధ ఛాయలు**

**- నివాళులర్పించేందుకు తరలిరానున్న అభిమానులు**

**కనిగిరి, మే 13, ప్రభాతవార్త**



కనిగిరి పట్టణ మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తమ్మనేని శ్రీనివాసరెడ్డి పెద్దకర్మ కార్యక్రమం గురువారం కొత్తూరులోని హనుమాన్ జూబ్లీ హిల్స్‌లో ఉన్న ఆయన స్వగృహంలో నిర్వహించనున్నట్లు కుమారులు తమ్మనేని సాయి నిలేష్ రెడ్డి, తమ్మనేని నిరంజన్‌రెడ్డి బుధవారం తెలిపారు. పట్టణ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న తమ్మనేని శ్రీనివాసరెడ్డి మరణం కనిగిరి ప్రాంత ప్రజలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా, అందరితో ఆప్యాయంగా మెలిగే వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉండేదని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు, కార్యకర్తలకు ఇచ్చిన ప్రోత్సాహం ఇప్పటికి మరువలేనిదని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. సామాజిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో ముందుండే ఆయన మృతి పట్టణ ప్రజలకు, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ఉద్యోగస్తులకు, బంధుమిత్రులకు తీరని లోటుగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఇంటి వద్దకు బుధవారం నుంచే అభిమానులు, రాజకీయ ప్రముఖులు చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ నివాళులర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించే పెద్దకర్మ కార్యక్రమానికి స్నేహితులు, అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై నివాలులర్పించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# చోరీల నివారణకు అప్రమత్తం కావాలి

### - బంగారు దుకాణ యజమానులకు పోలీసుల అవగాహన కార్యక్రమం



**మార్కాపురం, మే 13,(ప్రభాతవార్త**

నేరాల నివారణతో పాటు బంగారు దుకాణాల భద్రతను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్‌పి పర్యవేక్షణలో మార్కాపురం సిఐ అల్తాఫ్ హుస్సేన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో బంగారు దుకాణ యజమానులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు దుకాణాల్లో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దుకాణ పరిసరాలు, ప్రవేశ ద్వారాలు, నగదు లావాదేవీలు జరిగే ప్రాంతాలు స్పష్టంగా రికార్డు అయ్యే విధంగా కెమెరాలను అమర్చాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, భద్రతా అలారాలు, పటిష్టమైన లాకింగ్ వ్యవస్థలు ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. విలువైన బంగారు ఆభరణాల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. వ్యాపార వర్గాల సహకారంతోనే ఆస్తి నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని, ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పి సూచనల మేరకు, మార్కాపురం ఎస్‌డీపీఓ ఆధ్వర్యంలో మార్కాపురం సీఐ, ఎస్ఐలు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## జగనన్న కాలనీలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

### - ఆరుగురు అరెస్ట్ - నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం



**మార్కాపురం, మే 13,(ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణం శివార్ల లో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. ఈరోజు మార్కాపురం పట్టణ ఎస్ఐ విశ్వనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది నాగులవరం రోడ్డులోని జగనన్న కాలనీ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఆరు మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.14,616 నగదు, నాలుగు మోటార్ సైకిళ్లు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని మార్కాపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిపై కేసు నమోదు చేసి కోర్టు ఎదుట హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

## గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తుకు ఉచిత కోచింగ్ శిబిరాలు దిక్సూచి

### - కోచింగ్ శిబిరాన్ని సందర్శించిన రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె ఎర్రయ్య



**మార్కాపురం, మే 13,(ప్రభాతవార్త**

మార్కాపురం మండల రాష్ట్రోపాధ్యాయ సంఘం శాఖ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వివేకానందలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ కోచింగ్ శిబిరాన్ని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఎర్రయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఐదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న నవోదయ ప్రవేశ పరీక్ష శిక్షణతో పాటు, ఎనిమిదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎన్‌ఎంఎంఎస్ ఉచిత కోచింగ్ కార్యక్రమాలను పరిశీలించారు. విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి ఉచిత శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. పేద మరియు గ్రామీణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేందుకు ఈ తరహా శిబిరాలు దిక్సూచిలా మారుతున్నాయని అన్నారు. కోచింగ్ సెంటర్‌కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న షేక్ యూసఫ్, ఆర్గనైజర్ రంగస్వామి రెడ్డిల సేవలను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ మోలాలి విద్యార్థులకు జామపండ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో ఫ్యాకల్టీగా సేవలందిస్తున్న షేక్ యూసఫ్ షరీఫ్, కె రామకృష్ణారెడ్డి, రంగస్వామిరెడ్డి, ఈ హనుమంతరావు, రమణ, శ్రీనివాసులు తదితర ఉపాధ్యాయులను అభినందించారు. గణిత బోధన కోసం కొత్తగా చేరిన ఎస్‌కే చాంద్‌బాషాను ప్రత్యేకంగా స్వాగతించి అభినందనలు తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించిన కె ఎర్రయ్య, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం విద్యాభివృద్ధికి ఎల్లప్పుడు కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు అక్కల నారాయణ, ప్రధాన కార్యదర్శి టీవీ రమణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు బి విశ్వరూపాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఇంధన పొదుపుతో దేశాభివృద్ధికి తోడ్పడాలి

### - బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి



**మార్కాపురం, మే 13, (ప్రభాతవార్త**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సంక్షోభం తలెత్తే అవకాశం ఉందని, ఇలాంటి సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన ఇంధన పొదుపు పిలుపును ప్రతి ఒక్కరూ ఆచరించాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు. అవసరం లేని ప్రయాణాలను తగ్గించడం, ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడం, పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని మితంగా ఉంచడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు అందించవచ్చన్నారు. ఇంధన పొదుపు అంటే దేశ సంపదను కాపాడటమేనని పేర్కొంటూ, సౌరశక్తి, విద్యుత్ వాహనాలు, గ్రీన్ ఎనర్జీ వినియోగంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రతి పౌరుడు ఇంధన పొదుపులో భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఎరువుల దుకాణాల తనిఖీ చేసిన అధికారులు



**కంభం, మే 13 (ప్రభాతవార్త**

మండలంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మార్కాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీ నాయక్ బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా పట్టణంలో ఉన్న కళ్యాణి ట్రేడర్స్ దుకాణం యొక్క రెంట్ అగ్రిమెంట్ గత ఏడాది జూన్ నెలతో ముగిసినప్పటికీ అతను వ్యాపారం చేస్తున్నందున రూ.1,54,200ల విలువ చేసే 194 బీటీ పత్తి విత్తనాల ప్యాకెట్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు డి బాలాజీ నాయక్ మాట్లాడుతూ పురుగుమందు దుకాణాలలో కొనుగోలు చేసిన వాటికి రైతులు తప్పకుండా బిల్లు తీసుకోవాలని తెలిపారు. బిల్లు ఇవ్వని యెడల వ్యవసాయ శాఖ వారికి ఫిర్యాదు చేయవలసిందిగా రైతులకు తెలిపారు. దుకాణాదారులు అందరు కూడా నిర్ణీత ధరలకు మించి పురుగు మందులను, ఎరువులను అమ్మకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కంభం మండల వ్యవసాయ అధికారి ఈ దేవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అంబచెరువును పరిశీలించిన డిఈఈ హరి సంగ్



**రాచర్ల, మే 13 (ప్రభాతవార్త**

మండలంలోని జేపీ చెరువు గ్రామంలోని అంబచెరువును మార్కాపురం ఇరిగేషన్ శాఖ డి ఈ ఈ హరి సంగ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు అభివృద్ధికి 14.94 లక్షలు నిధులు మంజూరయ్యాయని, చెరువులో చేపట్టవలసిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గత ఎనిమిదేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు చెరువు కట్ట తెగిపోవడం అక్కడక్కడ చెరువు కోతకు గురి కావడంతో వర్షపు నీరు చుక్క నిల్వ ఉండకుండా వృధాగా పోతుండడంతో నీటి సంఘం సభ్యులు సమస్యను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించారు. చెరువు అభివృద్ధికి ప్రస్తుతం ఎఫ్‌డిఆర్ ద్వారా 5 లక్షలు, ఓఅండ్ఎం ద్వారా 9.94 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు ఇరిగేషన్ శాఖ డిఈఈ సిహెచ్ రామారావు, ఏఈ సుధాకర్ రావు, వర్క్ ఇన్స్పెక్టర్ శేఖర్, రంగస్వామి దేవస్థానం ఛైర్మన్ సిద్ధం నరసింహులు, నీటి సంఘం అధ్యక్షులు జమాలయ్య, టిడిపి సభ్యులు టి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## 22న శ్రీహజరత్ మౌలాలి సాహెబ్ స్వామి 5వ ఉరుసు మహోత్సవం

**రాచర్ల, మే 13 (ప్రభాతవార్త**

మండలంలోని జేపీ చెరువు అక్కపల్లి బస్టాండ్ వద్ద గల శ్రీ హజరత్ మోలాలి సాహెబ్ వారి 5వ ఉరుసు మహోత్సవంను ఈ నెల 22వ తేదీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా 22వ తేదీ స్వామి వారి దర్శనం, గంధం జండా మహోత్సవం ఆలయం నందు తదుపరి అక్కపల్లిలో స్వామివారి ఉత్సవం 23న బండ పందాలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 18 నుండి 20వ తేదిలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 70368 64667 నంబర్ సంప్రదించాలన్నారు. బండపందెంలో గెలుపొందిన విజేతలకు దాతల సహకారంతో మొదటి బహుమతి రూ.25 వేలు రెండో బహుమతి రూ.20 వేలు మూడో బహుమతి రూ.15 వేలు నాలుగో బహుమతి రూ.10 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

# మార్కాపురం వార్త



## రామాలయ నిర్మాణానికి పాబోలు శివదంపతులు లక్ష విరాళం



**పామూరు, మే 13, (ప్రభాతవార్త**

ఎస్సీ కాలనీలో నూతన రామాలయ నిర్మాణానికి పాబోలు ఏజెన్సీస్, నమస్కార్ కేఫ్ అధినేత పాబోలు శివరాజ్యలక్ష్మి లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ధర్మకార్యాలకి అనేక మంది దాతలు ముందుకు వచ్చి ఆలయ నిర్మాణానికి తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. తాను ఎప్పుడూ ఇలాంటి ధర్మకార్యాలకు ముందు ఉంటానని, భవిష్యత్తులో ఇంకా ఏమైనా అవసరమైనచో తమ వంతు సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పోకా లోకనాథం, ఆరెకొండ సురేష్‌బాబు, కామేపల్లి సూర్య ప్రకాష్, పోకా హరికృష్ణ, ఆలయ నిర్మాణ కమిటీ కోలనీడి రామకృష్ణ, మెడబలిమి రామస్వామి, మెడబలిమి నారాయణ, కోలనీడి మాలకొండయ్య, పందిటి రామయ్య, మెడబలిమి నిర్సింహులు, ఎం.చిన్న రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు

**నాగులుప్పలపాడు, మే13, (ప్రభాతవార్త**

వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఉప్పుగుండూరు శాఖా గ్రంథాలయంలో తరగతులు గ్రంధపాలకురాలు డి.ధనమ్మ ఆధ్వర్యంలో బుధవారం జరిగాయి. ముందుగా ఉదయం 6గంటల నుండి 7గంటల వరకు కరాటి మాస్టర్ గోగినేని వెంకట్ మోక్షత్ బ్లాక్ బెల్ట్ ఫస్ట్ డాన్ క్లాస్ తీసుకోవడం జరిగింది. కామిశెట్టి శంకరరావు యోగా క్లాస్‌లు నిర్వహించారు. అనంతరం పిల్లల చేత జాతీయ నాయకుల జీవిత చరిత్ర, నీతి కథలు చదివించి వారి చేత మరలా చెప్పించడం జరిగింది. శామ్యూల్ మాస్టర్ పిల్లలకు టీ తాగుదాం వస్తారా అంతే ప్రాస పదాలు నేర్పించడం వారికి ఒక వైపు బొమ్మ రెండవవైపు 500 సం. క్యాలెండర్ ఇవ్వడమైంది. పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసే క్రమంలో బొమ్మ మాది రంగులు మీవి చిత్ర లేఖనం పోటీ నిర్వహించడమైంది. దాత అమరా బాబు స్నాక్స్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గండు హరిబాబు, గొర్రిపాటి నగరాజకుమారి పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ అమలులో అలసత్వం అస్సలు సహించం

### - లక్ష్యాలకు దూరంగా ఉన్న ఏజెన్సీలపై బ్లాక్‌లిస్ట్ చర్యలు తప్పవు - కలెక్టర్ విజయ సునీత



**మార్కాపురం, మే 13, (ప్రభాతవార్త**

జిల్లాలో పీఎం సూర్య ఘర్ పథకం అమలును యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి జూలై నెలాఖరులోపు నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖ అధికారులు, అమలు సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. పథకం అమలులో జాప్యం, నిర్లక్ష్యం చూపుతున్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే బ్లాక్‌లిస్ట్‌లో చేర్చుతామని కలెక్టర్ హెచ్చరించారు. గ్రామాలు, పట్టణాల్లో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో పథకం పట్ల నమ్మకం కల్పించాలని సూచించారు. సోలార్ ప్యానళ్ల వల్ల విద్యుత్ ఖర్చు తగ్గడం, పర్యావరణ పరిరక్షణకు దోహదం కావడం వంటి ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులు ముందుండి ఈ పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు జనరల్ కేటగిరీలో 3 వేల సోలార్ కనెక్షన్ల లక్ష్యం ఉండగా ఇప్పటివరకు కేవలం 169 మాత్రమే పూర్తవ్వడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా ఏర్పాటు చేసే 2 కిలోవాట్ల సోలార్ ప్యానళ్ల లక్ష్యం 12,342 కాగా ఇప్పటివరకు 1,810 మాత్రమే పూర్తవ్వడాన్ని ప్రశ్నించారు. ఇకనైనా వేగం పెంచి లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. పనుల పురోగతికి అవసరమైన మెటీరియల్, సిబ్బంది సమకూర్చుకుని శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ కె.వెంకటేశ్వర్లు, మార్కాపురం, కనిగిరి ఈఈలు నాగేశ్వరరావు, ఉమాకాంత్, ఏడీఈలు షియానాయక్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

### వైభవంగా శత వార్షిక శ్రీ గంగా కాశీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి

## దేవాలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవం





**మార్టూరు, మే 13, (ప్రభాతవార్త**

గన్నవరంలో శ్రీ గంగా కాశీ అన్నపూర్ణ సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం నాడు అత్యంత వైభవోపేతంగా జరిగింది. రాష్ట్రంలోనే అత్యంత ప్రముఖ దేవాలయమైన, రాష్ట్రంలోనే నాలుగు ద్వారములు కలిగిన శివాలయం బాపట్ల జిల్లా, పర్చూరు నియోజకవర్గం యద్దనపూడి మండలం గన్నవరం గ్రామంలో ఉన్నది. దీనిని శ్రీ గంగా కాశీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవాలయం నిర్మించి 100 సంవత్సరాలు కావడంతో దేవాలయంలోని 37 అడుగుల ధ్వజస్తంభం శిధిలావస్థకు చేరడంతో ఆ స్థానంలో మళ్లీ కొత్తగా నలభై ఒక్క అడుగుల కీర్తి ధ్వజస్తంభం ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుని ఆలయ ధర్మకర్త కాళహస్తి హరిబాబు వారి ధర్మపత్ని లక్ష్మీ రాజ్యం నిర్ణయించి ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠకు ఏర్పాటు చేసి ఈ నెల 9వ తేదీ నుండి ఐదు రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటి రోజు తొమ్మిదో తేదీ శనివారం నాడు ఉదయం నుండి సాయంత్రం 6గంటల వరకు ప్రధాన ఆచార్యులు బ్రహ్మ, రుత్వికులు ఆలయ ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనము, అభిషేకం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, ఇదే రోజు మధ్యాహ్నం గ్రామ ప్రజలందరికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. రెండో రోజు పదవ తేదీ ఆదివారం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు నిత్య పూజ, సూర్య నమస్కారాలు, గ్రామ బలిహరణ , వాస్తు బలి, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, అనంతరం ఐదు గంటలకు డప్పులు మంగళవాయిద్యాలు మధ్య గ్రామ మహిళల కోలాటాల నూతన ధ్వజస్తంభ గ్రామోత్సవం జరిగింది. జనాధివాసము సాయంత్రం 6గంటలకు కైలాస మండపాధన, రుద్రహోమములు, యాగబలి, నిత్యహోమములు, ఆదివాస హోమములు, నీరాజనం, మంత్రపుష్ప అనంతరం తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. రెండో రోజు కూడామధ్యాహ్నం గ్రామ ప్రజలందరికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుంది. మూడో రోజు సోమవారం ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు నిత్య పూజ నీరాజనం, తీర్థ ప్రసాద వితరణ అనంతరం 6గంటలకు ధ్వజారోహణ, రుద్రమూర్తి హోమములు, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరుగును. మూడో రోజు కూడా మధ్యాహ్నం గ్రామ ప్రజలందరికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. నాలుగో రోజు మంగళవారం ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు వేద పారాయణం, నిత్య పూజ, ప్రధాన కలశ వాహన, ఏకాదశి రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన, నీరాజనం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమం. సాయంత్రం 6గంటలకు నిత్య పూజ, నవగ్రహ పరిహార దేవత హోమములు, పంచ శయ్యాది వానములు, చతుర్వేద పారాయణం, నీరాజనం, మంత్రపుష్పం, యజ్ఞపాయన వితరణ జరుగును. నీరాజనం, మంత్రపుష్పం, యజ్ఞపాయన వితరణ జరుగును. నాలుగో రోజు కూడా మధ్యాహ్నం గ్రామ ప్రజలందరికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఐదో రోజు ఆఖరి రోజు బుధవారం నిత్యార్చన, పుణ్యాహవచన, పంచగవ్య ప్రాసనము, గర్తన్యానము, రత్న న్యానము, అనంతరం వేద పండితులు నిర్వహించిన మూహూర్తమున ఉదయం 9గంటల 24 నిమిషాలకు వేలాది మంది భక్తులు హారు కాగా ఆలయ ధర్మకర్త కాళహస్తి హరిబాబు దంపతులు బ్రహ్మశ్రీ కొండ కావూరి సీతారామ ప్రసాద్‌శర్మ కోటప్పకొండ దేవస్థానం అర్చకులు ఆధ్వర్యంలో యంత్ర స్థాపన, జీవ ధ్వజ స్థాపన, వాస్తు వర్వగ్నీ కరణము, సప్త దర్శనములు, కుంభాభిషేకములు, పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, ఆచార్య మహదాశీర్వచనము తదుపరి పండిత సత్కారము జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు కొడవటి గంటి శివ కోటేశ్వరరావు శర్మ అర్చకత్వంలో ప్రతిష్ఠాచార్యులుగా కోటప్పకొండ దేవస్థాన ప్రధాన అర్చకులు శైవాగము పరీక్ష అధికారి బ్రహ్మశ్రీ కొండకావూరి అయ్యప్ప గురుకుల్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ కార్యక్రమం, అలాగే బ్రహ్మశ్రీ కొండ కావూరి సీతారామ ప్రసాద్ శర్మ కోటప్పకొండ దేవస్థానం అర్చకులు ఆధ్వర్యంలో జీవధ్వజ పునఃప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. ఈ ఆఖరి రోజుబుధవారం నాడు నాలుగు రోజులు పాటు గన్నవరం గ్రామ ప్రజలకు అన్న ప్రసాద వితరణ జరిగిన విధంగానే, గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు చుట్టు పక్కల అన్ని గ్రామాల ప్రజలకు, గ్రామస్తులతో పాటు, కార్యక్రమానికి విచ్చేసిన వారి వారిబంధువులకు, మహా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. సుమారు 5000 మందికి పైగా ఈ అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం నాడు గ్రామం బంధువులతో ప్రతి ఇల్లు కళకళలాడింది. వారి వారి బంధువులకి చీరలు, ఇంట్లో ఉండి ఉంటారు సారె పెట్టి గౌరవించారు.

## చెత్త సేకరణ రిక్షాలను ప్రారంభించి స్టేట్ బ్యాంకు రహదారిని ఊడ్చి శుభ్రం చేసిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు





**యర్రగొండపాలెం, మే 13, (ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టణంలోని పంచాయతీ కార్యాలయం వద్ద మండలంలోని 18 పంచాయతీల పారిశుధ్య కార్మికులకు ఆధునిక సదుపాయాలతో కూడిన 40 చెత్త సేకరణ రిక్షాలతో పాటు 240 తడి చెత్త పొడి చెత్త సేకరణ డబ్బాలను యర్రగొండపాలెం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు చేతుల మీదుగా ఆయా పంచాయతీల పారిశుధ్య కార్మికుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ రిక్షాల ద్వారా తడి చెత్త, పొడి చెత్తలను వేర్వేరూ సేకరించి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి చెత్తను శాస్త్రీయంగా వర్గీకరించి, పర్యావరణ పరిరక్షణతో పాటు చెత్త నుండి సంపద సృష్టి అనే లక్ష్యాన్ని సాధించవచ్చని తెలిపారు. తడి చెత్త ద్వారా కంపోస్టు తయారీ, పొడి చెత్తను రీసైక్లింగ్‌కు పంపించడం ద్వారా ఆదాయం వస్తుంది అని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని స్టేట్ బ్యాంకు వద్ద అక్కడి రహదారిని అధికారులు ఆ పార్టీ శ్రేణులతో కలిసి శుభ్రం చేశారు. పట్టణ పంచాయతీలో పారిశుధ్య కార్మికులు ఉడ్చే చీపుర్లు తగినన్ని లేకపోవడంతో చీపుర్లు పార్టీ శ్రేణులకు సరిపోవడంతో అధికారులకు చీపుర్లు లేకపోవడంతో అధికారులు చీపుర్లు పట్టకుండగానే వారి వెంట కొనసాగారు. వీధులు రహదారులను చీపురులతో శుభ్రం చేసి పారిశుధ్య కార్మికుల కృషిని అభినందిస్తూ వారి సంక్షేమం, పట్టణ అభివృద్ధికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని తెలిపారు. పట్టణాన్ని స్వచ్ఛంద, శుభ్రంగా ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి రామారావు నాయక్, సచివాలయ సిబ్బందితో పాటు తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ వెంగల్ రెడ్డి, మండల నాయకులు పేరం రమణారెడ్డి, తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ముస్లిం నాయకులు షేక్ ఇస్మాయిల్, మండల నాయకులు మాజీ సర్పంచ్ మాగులూరి వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ నాయకులు కేశినపల్లి మల్లిఖార్జున, ఆర్యవైశ్య నాయకులు కొత్తమాసు సుబ్రహ్మణ్యం, యర్రగొండపాలెం నీటి సంఘం అధ్యక్షులు కొప్పర్తి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ విద్యుత్ వినియోగంపై విజిలెన్స్ విస్తృత తనిఖీలు

### - రూ.4.03 లక్షల అపరాధ రుసుము విధింపు

**తర్లుపాడు, మే 13, (ప్రభాతవార్త**

అక్రమ విద్యుత్ వినియోగాన్ని అరికట్టేందుకు విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు బుధవారం తర్లుపాడు మండలంలో విస్తృత స్థాయి తనిఖీలు నిర్వహించారు. మొత్తం 39 బృందాలుగా ఏర్పడి మండలంలోని విద్యుత్ సర్వీసులను పరిశీలించినట్లు ఒంగోలు పర్యవేక్షక ఇంజనీర్ కె. వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ తనిఖీలలో 14 మంది అధికారులు, 82 మంది సిబ్బంది పాల్గొన్నారు. విద్యుత్ వినియోగ నిబంధనలు ఉల్లంఘించిన వినియోగదారులకు నోటీసులు జారీ చేయడంతో పాటు మొత్తం రూ.4 లక్షల 3 వేల అపరాధ రుసుము విధించినట్లు వెల్లడించారు. తనిఖీల్లో భాగంగా మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ వినియోగించిన 8 గృహాలకు రూ.1.41 లక్షలు, అనుమతికి మించిన లోడుతో విద్యుత్ వాడుతున్న 61 గృహాలకు రూ.2.30 లక్షలు, మీటరు లేకుండా విద్యుత్ వినియోగిస్తున్న 20 మందికి రూ.38 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం నివారణకు ఇటువంటి తనిఖీలు విద్యుత్ చట్టం ప్రకారమేనిర్వహిస్తున్నామని అధికారులు స్పష్టం చేశారు. విద్యుత్ చౌర్యంపై సమాచారం ఉన్నవారు 9440812358, 9440812359 నెంబర్లకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు టీ. హైమావతి, పి. నాగేశ్వరరావు, మార్కాపురం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సియా నాయక్, విజిలెన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఘన నారాయణ, వి. వెంకటేశ్వర్లు, ఏఈ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొందుగల వారి నవ దంపతులను ఆశీర్వదించిన

### యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు



**పెద్దదోర్నాల, మే 13, (ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండలం అయినముక్కల గ్రామంలో బుధవారం జరిగిన పొందుగల వారి కళ్యాణ మహోత్సవంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై నవ దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ వివాహ రెండు కుటుంబాలను కలిపి పవిత్ర బంధమని, నవ దంపతులు ఆనందంగా ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులు కార్యకర్తలతో కలిసి నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బంధుమిత్రులు పాల్గొన్నారు.

## టీడీపీ నాయకులు ఏర్వ రామచంద్రారెడ్డి మృతికి నివాళి

### - పార్థివ దేహాన్ని సందర్శించిన ఇన్‌చార్జి గూడూరి



**పెద్దదోర్నాల, మే13, (ప్రభాతవార్త**

పెద్దదోర్నాల మండలం ఎడవల్లి గ్రామానికి చెందిన ఏరువ రామచంద్రారెడ్డి మృతి పట్ల టీడీపీ శ్రేణుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు బుధవారం ఎడవల్లి గ్రామాన్ని సందర్శించి రామచంద్రారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. టీడీపీ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకుడు రామచంద్రారెడ్డి అని ఆయన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ షేక్ మాబు, నియోజకవర్గ అధ్యక్షుడు దొడ్డ శేషాద్రి, టీడీపీ మాజీ మండల ఏరువా మల్లిఖార్జునరెడ్డి, ఎక్కంటి పోలిరెడ్డి, టీడీపీ నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వీరభద్రపురం చక్కెర వ్యాధిగ్రస్తు పిల్లలకు చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ చేయూత



**యర్రగొండపాలెం, మే 13, (ప్రభాతవార్త**

యర్రగొండపాలెం మండలం వీరభద్రపురం గ్రామంలో ఐదు సంవత్సరాల వయసులోనే షుగర్ వ్యాధికి లోనైన ఇద్దరు పిల్లలకు చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ వారు ఆర్థిక సహాయం అందించారు. నరసరావుపేటలోని లైఫ్‌లైన్ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విషయం వార్త పత్రికల ద్వారా వైద్య ఖర్చులకు కూడా వారి వద్ద స్థోమత లేదని ప్రభుత్వం నుంచి గాని దాతల నుంచి సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలుసుకున్న వీరు సహాయం చేయడానికి ముందుకొచ్చిన విషయం తెలిసిందే. ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు పిల్లల వైద్య ఖర్చులకు తమ వంతుగా ఆ చక్కెర వ్యాధిగ్రస్తుల పిల్లల మేనమామ ద్వారా 10వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్న సహాయం చేసే చేతులు మిన్న అన్న సూక్తిని అనుసరించి మానవత్వం కలిగిన స్థానిక, స్థానికేతర దాతలు, స్వచ్ఛంద సంస్థలు పిల్లలు భారతి, సిద్ధుకు వైద్య ఖర్చులకు తమకు చేతనైనంతలో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు ఎంఈఓ పి.ఆంజనేయులు, ఇందిరా ప్రసాద్, సభ్యులు కోటేశ్వర్లు, ఏ.నాగయ్య, ఎం.రవీంద్రబాబు, గ్రంధిశీల కృష్ణ, షేక్ మహబూబ్ భాష, కే.పిచ్చయ్య, డి.శ్రీను, ఇమ్రాన్, జ్యోతి, ప్రసాదరావు, బాధిత పిల్లల మేనమామ మల్లిఖార్జున, బాబాయి, తిరుమలరావులు పాల్గొన్నారు.

## పశువులకు తాగునీటి వసతి కల్పించాలి

### - పోకూరు పశువైద్యశాలను తనిఖీ



**కందుకూరు మే 13, (ప్రభాతవార్త**

వేసవి ఉధృతి దృష్ట్యా పశుసంక్షేమం నిమిత్తం పొలాల్లో నిర్మించిన నీటి వనరులను తాగునీటితో నింపాలని వలేటివారిపాలెం లింగసముద్రం పశుసంవర్ధకశాఖ సహాయసంచాలకులు డా॥ఈ చెన్నకేశవులు పశుపోషకులకు సూచించారు. బుధవారం ఆయన తన అధికార పర్యటనలో బాగంగా పోకూరు పశువైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. ఆయా రికార్డులను పరిశీలించి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన పలు సలహాలు సూచనలు, ఆదేశాలు చేశారు. ప్రధానంగా వేసవి కాలంలో పశువులకు తాగునీటి సమస్య ఉండకూడదన్నారు. పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు తదితరులతో మాట్లాడి ఉపాధి పథకం ద్వారా పలు ప్రాంతాల్లో పశువులకు తాగునీటి వసతినిమిత్తం ఏర్పాటుచేసిన నీటివనరులను తాగునీటితోమ నింపాలని పేర్కొన్నారు. ఎండలు ఎక్కువగా ఉండటం వలన చెట్లు కింద పశువులను ఉంచాలని చెప్పారు. పశువులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది అశోక్, చౌదయ్య, మోనిక, మహిత , తదితరులు పాల్గొన్నారు

# అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు - చింతలచెరువు, చిట్యాల

**కనిగిరి, మే 13, ప్రభాతవార్త**

కనిగిరిటౌన్ కొత్తూరులోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ రెడ్డికార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, స్టేట్ ఐటీ వింగ్‌వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదఆశీర్వచనం చేసి స్వామివారి తీర్ధప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి చిత్రపటాన్ని అందించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ధైర్యానికి, సాహసానికి, మంచి తనానికి ప్రతి రూపమైన ఆంజనేయస్వామి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కనిగిరి నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్ధించారు. ఈ కార్యక్రమంలో వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, అంజిరెడ్డి, తురకపల్లి సర్పంచ్ రవీంద్రారెడ్డి, సూరిశెట్టి నారాయణ స్వామి, నందనవనం ఎంపీటీసీ, తుసరపల్లి సర్పంచ్ భవనం కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గురు ప్రసాద్, కనిగిరి మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కనుల పండుగగా సీతారాముల కళ్యాణం

**- భక్తులను ఆకట్టుకున్న భక్తిగీతాల సంగీత విభావరి - అధిక సంఖ్యలో హాజరైన భక్తులు**







**అద్దంకి , మే 13, ప్రభాతవార్త**

ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం రాత్రి శ్రీసీతారాముల వారి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా, కనుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళా భక్తులు వేలాదిగా హాజరు అయ్యారు. అద్దంకి నుండి కోటి తలంబ్రాల శోభాయాత్ర సింగరకొండ స్వామి వారి సన్నిధికి, రాత్రి 9గంటల ప్రాంతంలో చేరగా, స్వామివారి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారికి కళ్యాణ సందర్భంగా దాతలు, పట్టు వస్త్రాలు సమర్పించారు. వేదపండితులు, స్వామివారి కళ్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా భక్తి గీతాల సంగీత విభావరి, భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అర్ధరాత్రి వరకు జరిగిన ఈ కళ్యాణ మహోత్సవం, సింగరకొండలో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సంగీత సినీ గాయకులు, శ్రీలలిత, శ్రీవేదవాగ్దేవి ప్రవీణ్‌చరణ్‌లు భక్తి గీతాలను ఆలపించారు. ఆలయం కమీషనర్ తిమ్మానాయుడు, పాలకమండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, పాలకమండలి సభ్యులుతో పాటు పలువురు దాతలు ప్రత్యేకంగా, భాస్కర్ సప్లైయిర్స్ అధినేత, పట్టణ టిడిపి నాయకులు గార్లపాటి శ్రీనివాసరావులు ఈ కళ్యాణ మహోత్సవం ఏర్పాట్లలో విశేష కృషి చేశారు. అయితే భక్తులకు ఎటువంటి అసౌకర్యాం తలెత్తకుండా ఉదయం నుండే అటు ఆలయంలోను, ఇటు కళ్యాణ వేదికలోను, ఆలయ సిబ్బంది, అధికారులు, సేవా కార్యకర్తలు, తమ విశేషమైన సేవలు అందించారు.

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా..? అధికారుల పర్యవేక్షణ లోపమా..?

**- కాశిరెడ్డి కాలనీలో సైడు కాలువల పనులపై స్థానికుల ఆగ్రహం**

**- వర్షం వస్తే నిల్వ నీరు - దోమల బెడదతో ప్రజల ఇబ్బందులు**




**కనిగిరి, మే 13, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని కాశిరెడ్డి కాలనీలో మూడు నెలల క్రితం రూ.14లక్షల నిధులతో 450 మీటర్ల మేర నిర్మించిన సైడు కాలువల పనులపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాలువ నిర్మాణంలో పలు లోపాలు ఉన్నాయని ఆరోపిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల వివరాల ప్రకారం, గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాన్ని తొలగించకుండా అందే ప్రాంతంలో సైడు కాలువ నిర్మించడంతో మురుగు నీరు, వర్షపు నీరు సక్రమంగా పారడం లేదని తెలిపారు. ముఖ్యంగా వర్షం పడిన సమయంలో నీటి ప్రవాహానికి ఆ విద్యుత్ స్తంభం అడ్డంకిగా మారుతోందని, దీంతో కాలువల్లో నీరు నిల్వ ఉండే పరిస్థితి ఏర్పడుతోందని ఆరోపిస్తున్నారు. అలాగే కాలువ నిర్మాణం కోసం జేసీబీతో తవ్విన మట్టిని పనులు పూర్తైన తర్వాత తొలగించకుండా రోడ్ల పక్కన అక్కడక్కడ కుప్పలుగా వదిలేశారని స్థానికులు తెలిపారు. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కొన్ని చోట్ల కాలువ పక్కన మట్టిని పూడ్చకుండా వదిలేయడంతో భారీ గ్యాప్‌లు ఏర్పడి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. చిన్నారులు, వృద్ధులు, వాహనదారులు అప్రమత్తంగా వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సైడు కాలువలు నిర్మించిన కొన్ని ఇళ్ల నుంచి మురుగునీరు కాలువల్లోకి వస్తున్నప్పటికీ, మరికొన్ని ప్రాంతాల్లో నీరు సక్రమంగా ప్రవహించడం లేదని స్థానికులు చెబుతున్నారు. కాలువల్లో మధ్య మధ్యలో మట్టి పేరుకుపోవడంతో మురుగునీరు పారకుండా నిల్వ ఉండిపోతుందని తెలిపారు. దీంతో దోమల సమస్య అధికమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువల నిర్మాణ సమయంలో తీసిన మట్టిని వెంటనే తొలగించి కాలువలను పూర్తి స్థాయిలో శుభ్రపరచాలని, నీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కాంట్రాక్టర్‌ను కోరుతున్నారు. ప్రజాధనం ఖర్చు చేసి చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని విమర్శిస్తున్నారు. కాంట్రాక్టర్ పనులు నిర్వహిస్తున్న సమయంలోనూ, పనులు పూర్తయ్యే దశలోనూ అధికారులు సరైన పర్యవేక్షణ చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనుల్లో స్పష్టమైన లోపాలు కనిపిస్తున్నప్పటికీ అధికారులు కళ్లు మూసుకున్నారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబనంధిత అధికారులు స్పందించి కాలువల సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ప్రశాంతంగా సీతా రాముల కళ్యాణం

**- శాంతి భద్రతలపై పట్టణ సి.ఐ. ప్రత్యేక దృష్టి - అర్ధరాత్రి వరకు విధులలో ఉన్న పోలీసులు**




**అద్దంకి , మే 13, ప్రభాతవార్త**

ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ సన్నిధిలో మంగళవారం హనుమత్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అదే విధంగా కోటి తలంబ్రాల శోభాయాత్ర అద్దంకి నుండి సింగరకొండ వరకు సాగింది. స్వామివారి ఆలయం ముందు ఏర్పాటు చేసినప్రత్యేకపెండాల్‌లో శ్రీసీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అయితే ఉదయం నుండి సింగరకొండకు వేలాది మంది భక్తుల రద్దీ ప్రారంభమౌవంగా అర్ధరాత్రి వరకు ఈ రద్దీ కొనసాగింది. ఇది ఇలా వుండగా అద్దంకి పట్టణ సి.ఐ.సుబ్బరాజు ఆధ్వర్యంలో హనుమత్ జయంతి సందర్భంగా ఆలయ పరిసరాలు, ఆలయంలోను, సాయంత్రం అద్దంకి నుండి వేలాది మంది మహిళలతో సాగిన శోభాయాత్ర సందర్బంగా, సింగరకొండలో రాత్రికి జరిగిన శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం, భక్తి గీతాల సంగీత విభావరికి కూడ ప్రజలు అధిక సంఖ్యలో హాజరు అయ్యారు. ముఖ్యంగా ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయితే సి.ఐ. సుబ్బరాజు శోభాయాత్ర సందర్బంగా భక్తుల మధ్యలో ప్రత్యేక దృష్టిసారించి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక శ్రద్ద తీసుకోన్నారు. అదే విధంగా కళ్యాణ మహోత్సవంలో కూడ ప్రత్యేక దృష్టితో శాంతి భద్రతలను పర్యవేక్షించారు. ఏది ఏమైనా అటు హనుమత్ జయంతి, ఇటు సీతారాముల కళ్యాణం సందర్బంగా సింగరకొండకు 5 నుండి 7 వేల మందిదాక భక్తులు వచ్చినట్లు అంచనా. అయితే ఇంత పెద్ద ఎత్తున భక్తుల రద్దీ, అదికూడ అధిక సంఖ్యలో మహిళా భక్తులు, హాజరు అయినప్పటకీ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా సి.ఐ. సుబ్బరాజు శాంతి భద్రతలు పర్యవేక్షించారు.

## ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు గయాజ్‌కు ఆహ్వానం



**కనిగిరి, మే 13, ప్రభాతవార్త**

శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో రాజమండ్రిలో జూన్ 6,7వ తేదీలలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు కనిగిరికి చెందిన ప్రముఖ కవి, సినీ నటుడు, సామాజిక కార్యకర్త, తెలుగుదేశం పార్టీ కనిగిరి నియోజకవర్గ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు షేక్ గయాజ్ భాషాకు ఆహ్వానం అందింది. ఈ మహాసభలకు ప్రపంచ నలుమూలల నుంచి భాషాభిమానులు, సాహిత్యాభిలాషులు, రచయితలు హాజరు కానుండగా, సుమారు 500 మందికి పైగా పాల్గొనున్నారు. రెండు రోజుల పాటు సాహిత్య చర్చలు, కవి సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా షేక్ గయాజ్ భాషా మాట్లాడుతూ ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో పాల్గొనే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనకు ఆహ్వానం అందించిన శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తెలుగు భాషా వైభవాన్ని ప్రపంచ స్థాయిలో చాటిచెప్పే వేదికగా ఈ మహాసభలు నిలుస్తాయని పేర్కొన్నారు.

## కలిసికట్టుగా పని చేసి కనిగిరిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేద్దాం - దద్దాల



**కనిగిరి, మే 13, ప్రభాతవార్త**

జగనన్న సుపరిపాలనను తిరిగి తీసుకురావాలని పిలుపు హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా కష్టపడి పని చేసి వచ్చే 2029 సార్వత్రిక ఎన్నికల్లో కనిగిరిలో పార్టీ జెండా ఎగరేయాలని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా కొత్తూరులోని అభయాంజనేయస్వామి తిరునాళ్లలో భాగంగా పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ 2019-2024 మధ్య కాలంలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసిన నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఆయన పాలన సాగిందన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ కక్ష సాధింపుల కోసం అధికారాన్ని వినియోగిస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటు అనే ఆయుధంతో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలంతా కలిసి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, స్టేట్ ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్యాల విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జడ్పీటీసీలు మడతల కస్తూరిరెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, చిన్నిగారి కొండలు తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూలింగ్ వాటర్ చలివేంద్రం ప్రారంభించిన అడుసుమల్లి




**పామూరు, మే 13, ప్రభాతవార్త**

బొట్లగూడూరు సెంటర్లో జేఆర్కే ఫౌండేషన్ అధినేత తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కోటపాటి జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ చలివేంద్రంను ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు మందలపు చిన్న నారాయణ, తాజా మాజీ సర్పంచ్ ఎర్రగుళ్ల బాల, గ్రామ పార్టీ అధ్యక్షులు కోటపాటి వెంకటేశ్వర్లు, మండల కార్యనిర్వహక కార్యదర్శి గోనుగుంట సుధాకర్, అనపర్తి శశి మహేశ్వరరావు, కోటపాటి రాజా, ఆవులూరి మురళి శ్రీనివాసరావు, కోటపాటి నరసింహారావు, గుర్రాల నాగేశ్వరరావు, దుగ్గినేని తిరిపాలు, కోటపాటి కొండల్, కోటపాటి గోపాల్, ఖాజా రఫీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బోసురెడ్డిని పరామర్శించిన మానవతా సభ్యులు



**పామూరు, మే 13, ప్రభాతవార్త**

ఆరోగ్య సమస్యలతో ఇటీవల నెల్లూరు ఒంగోలు వైద్యశాలలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మానవతా సంస్థ సభ్యులు సుభాష్‌రెడ్డి(బోసు)ని బుధవారం నాడు పామూరు మానవతా సేవా సంస్థ సభ్యులు వెండిదండి వెంకటేశ్వర్‌రెడ్డి, కల్లూరు రామిరెడ్డి, తోట రమేష్, రంగారెడ్డి తదితరులు కలిసి క్షేమసమాచారాలు తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంగా యదాస్థితికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.

## మానవత్వం చాటుకున్న జిల్లా కలెక్టర్ విజయ సునీత



**పొదిలి, మే 13, ప్రభాతవార్త**

పొదిలి మండలం మాదిరెడ్డిపాలెం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పొదిలి మండలంలో వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆ మార్గంలో వెళ్తున్న జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత స్పందించి, ఆమె కారును ఆపించారు. ప్రమాద స్థలంలో క్షతగాత్రులకు తక్షణం వైద్యం అందేలా చర్యలు తీసుకొని మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారు. వెంటనే స్పందించిన కలెక్టర్ గాయపడిన వారిని దగ్గరుండి ఆసుపత్రికి తరలించేలా అధికారులకు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. బాధితులకు తక్షణ చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంలో అక్కడున్న ప్రజలు ఆమె స్పందనను అభినందించారు. అప్రమత్తంగా స్పందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి సహాయం చేయడం ద్వారా జిల్లా కలెక్టర్ విజయ సునీత తన మానవత్వాన్ని చాటుకున్నారని స్థానికులు పేర్కొన్నారు.

## పది సప్లిమెంటరీలో ప్రతి విద్యార్ధి ఉత్తీర్ణత సాధించాలి

**- కలెక్టర్ విజయ సునీత**




**పొదిలి, మే 13, ప్రభాతవార్త**

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ప్రతి విద్యార్ధి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టితో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత సూచించారు. బుధవారం పొదిలి పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నతపాఠశాలలతో పాటు ఉప్పలపాడు పాఠశాలల్లో శిక్షణ పొందుతున్న పదవ తరగతి విద్యార్థులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సప్లిమెంటరీ పరీక్షలకు కేవలం 12 రోజుల సమయం మాత్రమే ఉన్నందున ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ద పెట్టాలని సూచించారు. సరైన ప్రణాళికతో బోధన అందిస్తే నూరుశాతం ఉత్తీర్ణత సాధించవచ్చని తెలిపారు. విద్యార్థుల బలహీన అంశాలను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం తలమళ్ళ గ్రామంలో నిర్వహించిన నేను బడికి పోతా కార్యక్రమం ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడు మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించేలా కృషి చేసిన ఉపాధ్యాయ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. తదుపరి పొదిలి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ రికార్డులను పరిశీలించి పలు అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ఎం.శ్రీనివాసులు, తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంఈఓ నాగలక్ష్మీ, సీడీపీవో సుధా మారుతి, పొదిలి కమీషనర్ మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా భద్రత అవగాహన కార్యక్రమం



**చీరాల, మే 13, ప్రభాతవార్త**

కారంచేడులోని రాఆనాయుడు కళ్యాణ మండపంలో మహిళాభద్రత అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ సూచనలతో ఇంకొల్లు సీఐ రామానాయక్ నేతృత్వంలో కారంచేడు ఎస్సై ఖాదర్ భాషా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోమహిళలు, బాలికలు నిత్యం ఎదుర్కొనే సమస్యలు, వేదింపుల నివారణకు పాటించాల్సిన మెలుకువలను ఎస్సై వివరించారు. ఆపద సమయాల్లో పోలీసు శాఖ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ డయల్ 112 సేవలను ఎలా వినియోగించుకోవాలో ప్రత్యక్షంగా వివరించారు. సోషల్ మీడియా ద్వారా పొంచి ఉన్న ముప్పులు, సైబర్ మోసాల పట్ల మహిళలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పద వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సఖీ టీం సభ్యురాలు ఉషారాణి, చీరాల శక్తి టీం కానిస్టేబుల్ కే.సుబ్బారావులు పాల్గొని మహిళలకు భద్రతా పరమైన సూచనలు చేశారు. న్యాయవాది శిరీష మహిళలకు ఉన్న చట్టపరమైన హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమాల పట్ల స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయా అంగన్‌వాడీ సీఈపీలు, ఆశా వర్కర్లు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

## ఏటీవీ రైడింగ్ వాహనాన్ని నడిపిన ఎంపీ మాగుంట



**ఒంగోలు, ప్రభాతవార్త**

గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ స్టడీ టూర్‌లో భాగంగా గుల్మార్గ్‌లో ఏటీవీ రైడింగ్ వాహనాన్ని సరదాగా నడిపిన కమిటీ చైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి. మంచుతో కప్పబడిన కొండలు, దట్టమైన అడవులు, అందమైన లోయల గుండా ఏటీవీ వెహికల్ రైడ్ చేయడం పర్యాటకులను భాగా ఆకట్టుకుంటుంది. ఇది ఒక గొప్ప అనుభూతి అని తెలియజేశారు.

## అంకం వారి వివాహా వేడుకలలో భద్రారెడ్డి



**అద్దంకి , మే 13, ప్రభాతవార్త**

అద్దంకి మండలం, మైలవరం గ్రామ పంచాయతీ పరిధిలోని ఏలేశ్వరవారిపాలెం గ్రామంలో మాజీ సర్పంచ్ అంకం కొండలు, కుమారుని వివాహం బుధవారం ఉదయం జరిగింది. ఈ వివాహానికి వైఎస్ఆర్సీపీ సీనియర్ నాయకులు వై.వి.భద్రారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అద్దంకి పట్టణ వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు కాకాని రాధా కృష్ణ మూర్తి ,రాష్ట్ర వైఎస్ఆర్సీపీ ప్రచార కమిటీ విభాగం జాయింట్ సెక్రటరీ కోయి అంకారావు, సాంబశివరావు, తదితరులు వున్నారు.

## మేదరమెట్లలో స్వచ్ఛపధ కార్యక్రమం

**- పాల్గొన్న జిల్లా, పంచాయితీ అధికారులు**




**కొరిసపాడు , మే 13, ప్రభాతవార్త**

మండలంలోని మేదరమెట్ల గ్రామంలో బుధవారం అధికారులు స్వచ్ఛపధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా స్వచ్ఛ గ్రామం, స్వచ్ఛ వార్డు అధికారిని సిహెచ్ సువార్త, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కేఎస్ మల్లికార్జునరావులు గ్రామంలోని రహదారులను డ్రైనేజీలను పరిశీలించారు. ఈ సందర్బంగా గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామాలను స్వచ్ఛంగా, పరిశుభ్రంగా, ప్రజలు ఆరోగ్యంగా ఉండడానికిఈ స్వచ్ఛపదం కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ప్రజలందరూ తమగృహాల పరిసరాలనే కాకుండా వీధులను కూడా పరిశుభ్రంగా ఉండేలా చూస్తేఈ కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ గ్రామం సాధ్యం అవుతుందని కూడా తెలియజేశారు. అనంతరం గ్రామ బస్టాండ్ నుండి అద్దంకి రాష్ట్రీయ రహదారి ఇరువైపులా పేరుకుపోయి ఉన్న చెత్తను గుర్తించి పారిశుధ్య కార్మికులతో శుభ్రంచేయించారు. గ్రామంలోని వీధులను, డ్రైనేజీలను కూడా కార్మికులతో శుభ్రపరిచి చెత్తను ట్రాక్టర్లతో డంపుకు తరలించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్‌లక్ష్మీకాంత్, ప్రజాప్రతినిధులు, డిపిఆర్సి సిబ్బంది, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

## మీ కోసం కార్యక్రమాన్ని వినియోగించుకోండి

**- తహసిల్దార్ జి వి సుబ్బారెడ్డి**



**కొరిసపాడు , మే 13, ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జరుగుతున్ననెలలో ప్రతి శుక్రవారం ఒక నియోజకవర్గంలో మీకోసం కార్యక్రమం శుక్రవారం అద్దంకి నియోజకవర్గం లోని సంతమాగులూరు మండలంలో నిర్వహించడానికి జిల్లా అధికారులు నిర్ణయించారని, కొరిసపాడు మండల తహసిల్దార్ జి వి సుబ్బారెడ్డి తెలియజేశారు. ఈ మీకోసం కార్యక్రమం శుక్రవారంఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సంతమాగులూరు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుందన్నారు. జిల్లా యంత్రాంగం మొత్తం మీకోసం కార్యక్రమానికి క్షేత్రస్థాయికి వస్తుందన్నారు. కొరిసపాడు మండలం లోని గ్రామాల ప్రజలు తమ సమస్యలను శుక్రవారం సంతమాగులూరు లో జరగనున్న మీకోసం కార్యక్రమంలో అధికారులు దృష్టికి తీసుకువచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలియజేశారు.

## గడ్డి వారి వివాహ వేడుకలో యారవ



**పామూరు, మే 13, ప్రభాతవార్త**

పామూరు మండలంలోని దొడ్డ వెంకటపల్లి గ్రామానికి చెందిన గడ్డి వారి వివాహ వేడుకలో కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్ పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యారవ మిత్రబృందం పాల్గొన్నారు.

